సాక్షి
అనంతపురం
మంగళవారం । 28 । నవంబర్ । 2023



జిల్లా ప్రగతి పరుగు

జిల్లా పరిషత్ పరిధిలో రెండేళ్ల వ్యవధిలో అభివృద్ధి పనులకు రూ.28.54 కోట్లు వెచ్చించారు. రూ.7.62 కోట్ల సాధారణ నిధులతో వివిధ పనులు చేపట్టారు. 8లో



కిలో టమాట రూ.22

అనంతపురం శివారు కక్కలపల్లి టమాట మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.22, కనిష్టంగా రూ.6.50, సరాసరిన రూ.16 ప్రకారం ధర పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
32.8°/19.6°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. ఆకాశం మేఘావృతమై జల్లులు పడ్డాయి. ఉదయం వేళల్లో చలి వాతావరణం కొనసాగుతోంది. గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

పూలే విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి, కారుమూరి, తదితరులు

తాడిపత్రి టౌన్: స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన జ్యోతిరావు పూలే విగ్రహాన్ని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు సోమవారం ఆవిష్కరించారు. వారి వెంట ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రాష్ట్ర కార్యదర్శులు రమేష్‌రెడ్డి, పేరం స్వర్ణలత, డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత, మాజీ చైర్మన్ పామిడి వీరా, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి, రాజారాం, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షురాలు సైపుల్లా బేగం ఉన్నారు.

‘ఆడుదాం ఆంధ్ర’ విజయవంతం కావాలి

అనంతపురం అర్బన్: జిల్లాలో ‘ఆడుదాం ఆంధ్ర’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి పిలుపునిచ్చారు. కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో క్రీడాకారుల రిజిస్ట్రేషన్, మస్కట్ లోగోను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ 15 ఏళ్లు పైబడిన యువతను క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలి, మంచి అలవాట్లు, పోటీతత్వం అలవర్చాలనే ప్రధాన లక్ష్యంతో ప్రభుత్వం క్రీడా పోటీలు నిర్వహిస్తోందన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గం, రాష్ట్రస్థాయిలో డిసెంబరు 15 నుంచి 2024 ఫిబ్రవరి 3 వరకూ పోటీలు జరుగుతాయన్నారు. పోటీల నిర్వహణకు అవసరమైన సామాగ్రిని సచివాలయాలకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అందజేస్తుందన్నారు. మైదానాలు, స్టేడియాలు సంసిద్ధం చేస్తారన్నారు. ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో 10 మంది స్పోర్ట్స్ వలంటీర్లను ఎంపిక చేసి నిబంధనలపై శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు.

రిజిస్ట్రేషన్ ఇలా...

బాలబాలికలు తమ సమీపంలోని సచివాలయంలో నమోదు చేసుకోవచ్చని జిల్లా స్పోర్ట్స్ కార్యాలయం డీఎస్‌డీఓ నరసింహారెడ్డి తెలిపారు. aadudamandhra. ap.gov.in వెబ్‌సైట్‌లో లేదా 1902 నంబర్‌కు కాల్ చేసి కూడా రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు.

స్కాన్ సెంటర్ నిర్వాహకులపై పిటిషన్

అనంతపురం మెడికల్: అనధికారికంగా స్కానింగ్ సెంటర్ నిర్వహిస్తూ లింగ నిర్ధారణ చట్టాన్ని ఉల్లంఘించిన సునీల్‌కుమార్, శ్రావణిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ భ్రమరాంబ దేవి సోమవారం నగరంలోని ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో పిటీషన్ దాఖలు (సీఎఫ్ నెంబర్ 2019/2023) చేశారు. వివరాలు.. అనంతపురానికి చెందిన సునీల్ కుమార్ నగరంలోని ఎర్రనేల కొట్టాలలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఫార్మసిస్ట్ శ్రావణితో కలసి అనధికారికంగా స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేశాడు. విద్యార్హత లేకున్నా గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలకే అత్యంత ప్రాధాన్యతనిస్తూ గర్భిణుల ప్రాణాలతో చెలగాటమాడసాగారు. విశ్వసనీయ సమాచారంతో ఈ నెల 21న దాడులు నిర్వహించిన డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి, తహసీల్దార్ బాలకృష్ణ, అనంతపురం మూడో పట్టణ పోలీసులు గుట్టు రట్టు చేశారు. కొన్ని నెలలుగా గర్భిణులతో రూ.లక్షలు తీసుకుని 128 స్కాన్‌లు చేసినట్లు గుర్తించారు. స్కాన్ సెంటర్‌ను సీజ్ చేశారు. ఈ క్రమంలో నిందితులపై తదుపరి చర్యల నిమిత్తం కోర్టులో డీఎంహెచ్‌ఓ పిటిషన్ దాఖలు చేశారు.

ఘనంగా పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

నార్పల: గూగూడులో కుళ్లాయిస్వామి పల్లకీ సేవ సోమవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని సర్పంచు రమణ కుమారి, ఎంపీటీసీ రాజారెడ్డి, కో–ఆప్షన్ షాబీరా పూజలు చేసి ప్రారంభించారు. మంగళవారం ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈఓ శోభా, ఆలయ కమిటీ చైర్మన్ శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సభా వేదిక వద్దకు వస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



తాడిపత్రిలో సామాజిక సాధికార బస్సు యాత్రకు హాజరైన జనసందోహంలో ఓ భాగం

బడుగులకు గౌరవం

- సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాలకూ సముచిత స్థానం
- ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్దపీట
- సామాజిక సాధికారతను వివరించిన మంత్రులు, ప్రజాప్రతినిధులు
- మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపు
- తాడిపత్రిలో బస్సు యాత్ర విజయవంతం



సభలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, చిత్రంలో మంత్రి ఉషశ్రీ, ఎంపీలు రంగయ్య, నందిగం సురేష్, ప్రభుత్వ విప్ కాపు, ఎమ్మెల్యేలు పెద్దారెడ్డి, శంకరనారాయణ, హఫీజ్ ఖాన్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, నాయకులు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ప్రజాప్రతినిధులు

తాడిపత్రి: బడుగు,బలహీన వర్గాల వారికి తగిన గౌరవం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మంత్రులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలకూ సముచిత స్థానం లభించిందని పేర్కొన్నారు. సోమవారం తాడిపత్రి పట్టణంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతమైంది. మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు, ఉషశ్రీ చరణ్‌తో పాటు ఎంపీలు తలారి రంగయ్య, నందిగం సురేష్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, పెనుకొండ ఎమ్మెల్యే శంకర నారాయణ, వైఎస్సార్ సీపీ ఉరవకొండ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, పార్టీ జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైపుల్లా, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న తదితరులు పాల్గొన్నారు. మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్ద పీట వేసిన ఖ్యాతి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మంచి స్కిల్స్ ఉన్న సీఎంగా జగనన్న పేరు గడిస్తే, సీఎం పీఠాన్ని దుర్వినియోగం చేసి స్కాంలు చేసిన వ్యక్తిగా టీడీపీ అధినేత చంద్రబాబు చరిత్రకెక్కారన్నారు. ఎస్సీలుగా ఎవరైనా పుట్టాలని అనుకుంటారా అన్న వ్యక్తి నేడు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా మాయమాటలు చెబుతున్నారని విమర్శించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లగా పాలనను పరుగులు పెట్టిస్తున్న సీఎం జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు.

పోటెత్తిన జనం

తాడిపత్రిలో సామాజిక సాధికార బస్సు యాత్రకు జనం పోటెత్తారు. స్థానిక సీబీ రోడ్డు జనసంద్రాన్ని తలపించింది. మధ్యాహ్నం 3.30 గంటలకు భగత్‌సింగ్ నగర్‌లోని పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా ప్రజాప్రతినిధులు బయలుదేరారు. సిద్ధిబాష దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ర్యాలీ వైఎస్సార్ సర్కిల్‌కు చేరుకుంది. దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, సభాస్థలి వద్దకు చేరుకున్నారు. ర్యాలీ ఆద్యంతం జై జగన్.. నినాదాలు మార్మోగాయి. సభ ప్రారంభానికి ముందు సీఎం జగన్ పాలనపై వినిపించిన పాట అందరినీ ఉర్రూతలూగించింది.

జగనన్న విశ్వసనీయతకు మారుపేరు



విశ్వసనీయతకు మారుపేరుగా జగనన్న పేరు గడించారు. బడుగు బలహీన వర్గాలకు అన్నింటా సముచిత స్థానం కల్పించారు. బస్సు యాత్రకు తరలివచ్చిన జనాన్ని చూస్తుంటే తాడిపత్రి నియోజకవర్గంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురుతుందనే నమ్మకం నాకుంది. జగనన్న సింహంలాంటోడు. చంద్రబాబు నక్కలాంటోడు అనే విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలి. చంద్రబాబుకు ఎన్నికల ముందే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు గుర్తుకు వస్తారు. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో బూటకపు హామీలిస్తున్నారు. ప్రజలే ఆయనకు మళ్లీ బుద్ధి చెప్పాలి.

– తలారి రంగయ్య, ఎంపీ



వైఎస్సార్ సీపీ జెండా, ఫ్యాన్ బొమ్మతో అభిమాని

ఫ్యాన్స్ జోరు





సీఎం జగన్ చిత్రపటాలు, వైఎస్సార్ సీపీ జెండాలతో ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

టీడీపీకి షాక్



తాడిపత్రిలో తెలుగుదేశం పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జిలాన్ బాష సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సమక్షంలో కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ వైఎస్సార్‌సీపీ కండువా కప్పి..పార్టీలోకి ఆహ్వానించారు.

అభివృద్ధికి అడుగడుగునా అడ్డంకులు



చంద్రబాబు నాయుడు ఏనాడూ ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సముచిత స్థానం కల్పించిన పాపానపోలేదు. జేసీ ప్రభాకర్‌రెడ్డి మున్సిపల్ ఎన్నికల ముందు సేవ్ తాడిపత్రి అని మొసలి కన్నీరు కార్చారు. ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారికి పదవులు ఇస్తానని చెప్పి గెలిచారు. విజయం సాధించాక నమ్మిన వారిని వంచించారు. తినే తిండి నుంచి కట్టేబట్ట వరకు ప్రజల నుంచే దోచుకుంటున్నారు. తాడిపత్రిలో 20 షాపురూములను బినామీలకు కట్టబెట్టి బాడుగల ద్వారా బతికేస్తున్నారు. తాడిపత్రిలో ఏ అభివృద్ధి పని చేపట్టినా అడ్డుకోవడమే పనిగా పెట్టుకున్నారు. జూనియర్ కళాశాల గ్రౌండ్ ప్రహరీ నిర్మాణ పనులతో పాటు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పనులను అడ్డుకున్నారు. బీసీలు, మైనార్టీలకు ఆంజనేయస్వామి మాన్యంలో 750 పట్టాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తే అడ్డు తగిలారు. తాడిపత్రికి గతంలో వంద పడకల ఆసుపత్రి మంజూరైతే జేసీ దివాకర్‌రెడ్డి రద్దు చేయించారు. నేడు నేను ఆస్పత్రి నిర్మాణ పనులు చేయిస్తుంటే, కాంట్రాక్టర్, ఇతర కార్మికులను బెదిరిస్తున్నారు. ఇలాంటి లుచ్చాలు ప్రజాప్రతినిధులైతే తాడిపత్రి ఎలా అభివృద్ధి చెందుతుందో ప్రజలు ఆలోచించుకోవాలి.

– ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, తాడిపత్రి

జేసీ సోదరులను నమ్మొద్దు



దుష్టులైన జేసీ సోదరులను నమ్మితే జీవితాలను చేజేతులా నాశనం చేసుకున్నవారవుతారు. వైఎస్సార్ సీపీని మరోసారి గెలిపిస్తేనే తాడిపత్రి అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది. జీవితాలు బాగుపడతాయి. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ ఇలా అన్ని వర్గాల ప్రజల కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలుద్దాం.

–పైలా నరసింహయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

బీసీలకు సముచిత స్థానం



దేశంలో ఎక్కడాలేని విధంగా బీసీలకు రాజకీయ పదవులు ఈ ప్రభుత్వంలో లభించాయి. 50 శాతానికి పైగా పదవులను బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు సీఎం జగన్ కట్టబెట్టారు. 2019కి ముందు తాడిపత్రిలో రాక్షస పాలన కొనసాగింది. నేడు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో జేసీ కుటుంబానికి ప్రజలే రాజకీయ సమాధి కట్టాలి.

– హరీష్ యాదవ్, యాదవ కార్పొరేషన్ చైర్మన్

మల్లాపురంలో సంబరాలు



పురస్కారం అందుకున్న రైతు నారాయణప్ప



సంబరాలు చేసుకుంటున్న నారాయణప్ప కుటుంబ సభ్యులు

కళ్యాణదుర్గం: మండలంలోని మల్లాపురంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామానికి చెందిన రైతు నారాయణప్ప సోమవారం న్యూఢిల్లీలో ‘కర్మ వీర్ చక్ర’ పురస్కారం అందుకోవడంతో గ్రామస్తులు సంబరాలు చేసుకున్నారు. అవార్డు అందజేసే కార్యక్రమాన్ని సెల్‌ఫోన్లో వీక్షిస్తూ పలువురికి స్వీట్లు పంచిపెట్టారు. తమ కష్టానికి గౌరవం దక్కిందని నారాయణప్ప భార్య పార్వతి సంతోషం వెలిబుచ్చారు.

మంత్రి ఉషశ్రీ అభినందన..

కర్మవీర్ పురస్కారం అందుకున్న రైతుకు అభినందనలు వెల్లువెత్తాయి. రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ ఫోన్‌లో ఆయనను అభినందించారు. తమ ప్రాంత రైతుకు అంతర్జాతీయ స్థాయిలో పురస్కారం దక్కడం సంతోషకరమన్నారు. కొత్త తరహా పద్ధతుల్లో పంటలు పండిస్తూ ఆదర్శంగా నిలిచారన్నారు. మారుమూల గ్రామమైన మల్లాపురంతో పాటు రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారన్నారు.

ఏటీఎం మోడల్‌తో గుర్తింపు..

రైతు నారాయణప్ప ఎనీ టైం మనీ (ఏటీఎం) పద్ధతితో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. సేంద్రియ పద్ధతిలో ఎరువులను తయారు చేసుకుని ఏడాది పొడవునా పంట దిగుబడి వచ్చేలా ఆయన అవలంబించిన పద్ధతికే ఎనీ టైం మనీ (ఏటీఎం) అనే పేరు వచ్చింది. తనకున్న పొలంలో 3.7 ఎకరాలలో మామిడి, మిగిలిన 40 సెంట్ల స్థలంలో 30 సెంట్లలో ఏటీఎం పద్ధతిలో సుమారు 20 రకాల పంటలను నారాయణప్ప సాగు చేశారు. పంట ఉత్పత్తుల్లో ఇంటికి సరిపడా ఉంచుకుని మిగిలిన వాటిని మార్కెట్‌కు తరలించేవారు. రూ.5 వేల పెట్టుబడితో ఏడాదికి రూ.2 లక్షల ఆదాయాన్ని గడిస్తూ రైతులకు రోల్ మోడల్‌గా నిలిచారు. గ్రామంలో తనతో పాటు ప్రస్తుతం 25 మంది రైతులకు ఏటీఎం మోడల్‌ను పరిచయం చేశారు. వీరిని చూసి పరిసర గ్రామాలకు చెందిన సుమారు 3,500 మంది రైతులు నారాయణప్ప బాటలో అడుగులేస్తున్నారు. నారాయణప్ప ఏటీఎం మోడల్‌పై ‘సాక్షి’లో మే 2న ప్రత్యేక కథనం కూడా ప్రచురితమైంది. ఈ క్రమంలోనే ఆయనకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఐక్యరాజ్య సమితి, ఆర్ఈఎక్స్, కర్మ వీర్ గ్లోబల్ ఫెలోషిప్ భాగస్వామ్యంతో ఇంటర్నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఎజీఓస్ (ఐకాంగో) అందించే అవార్డు వరించింది.

దిగ్గజాల సరసన..

అంతర్జాతీయ స్థాయి అవార్డు అందుకుని దిగ్గజాల సరసన నారాయణప్ప నిలిచారు. గతంలో ఈ అవార్డును వ్యవసాయ రంగంలో విశిష్ట సేవలందించిన దివంగత శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్, క్రీడా రంగంలో రాహుల్ ద్రావిడ్, పుల్లెల గోపీచంద్, కళా రంగంలో కాజోల్ తదితరులకు అందజేశారు. ఇప్పుడు వీరి సరసన నారాయణప్ప చోటు దక్కించుకోవడం గమనార్హం.

అర్జీలకు సత్వర పరిష్కారం

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం
- ‘స్పందన’లో 308 వినతులు



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ‘స్పందన’, ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమాల్లో ప్రజల నుంచి అందే అర్జీలను సత్వరం పరిష్కరించడమే లక్ష్యంగా పని చేయాలని కలెక్టర్ ఎం.గౌతమి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ‘స్పందన’ నిర్వహించారు. ప్రజల నుంచి కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ గాయత్రి దేవి, ఆర్‌డీఓ గ్రంధి వెంకటేష్, డిప్యూటీ కలెక్టర్లు సుధారాణి, ఆనంద్ అర్జీలు స్వీకరించారు. మొత్తం 308 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. ఏ దశలోనూ నిర్లక్ష్యానికి తావివ్వకూడదని సూచించారు. తమ శాఖ సిబ్బందితో రోజూ సమీక్షిస్తూ ఉండాలని ఆదేశించారు.

వినతులు కొన్ని..

- ఎస్సీ, ఎస్టీ దివ్యాంగ కోటా కింద తనకు సాగు భూమి మంజూరు చేయాలని ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ ఉత్తర్వులు జారీ చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఎం.మద్దిలేటి (మరుగుజ్జు) వాపోయారు. చియ్యేడు పొలం సర్వే నంబరు 155లో 2.50 ఎకరాలు సర్వే చేశారని, తన పేరున ఫైలు కూడా సిద్ధం చేశారని చెప్పారు. ఇప్పటి వరకు భూమి మంజూరు చేయలేదని, తహసీల్దారును అడిగితే సాగులో ఉన్న వారికి పట్టా ఇస్తామంటున్నారని వాపోయారు. భూమి ఇచ్చి ఆదుకోవాలని కోరారు.
- సాగులో తాము ఉంటే వేరొకరు ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నారని బుక్కరాయసముద్రం మండలం చెదల్ల గ్రామానికి చెందిన సుష్మిత ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 10లో 4.31 ఎకరాలను సాగు చేసుకుంటున్నామని, కోర్టులోనూ ఆ వ్యక్తిది ఫేక్ అని తేలిందన్నారు. ఆన్‌లైన్‌లో వారి పేరు తొలగించి తన పేరు నమోదు చేయాలని కోరారు.
- భూమిని సర్వే చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని కణేకల్లు మండలం గంగలాపురానికి చెందిన తాయన్న విన్నవించారు. గ్రామ పొలం సర్వే నంబరు 1165–2లో తనకు రెండు ఎకరాలు ఉందన్నారు. సర్వే చేసి హద్దులు చూపించాలని అధికారులను విన్నవించినా పట్టించుకోలేదని చెప్పారు. చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

ఓటు హక్కు పునరుద్ధరించి ఎన్నికలు జరపాలి



కలెక్టర్‌కు అర్జీ అందజేసేందుకు వచ్చిన మత్స్యకార సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: జిల్లాలోని 30 మత్స్యకార సంఘాలకు ఓటు హక్కు పునరుద్ధరించిన తర్వాత జిల్లా మత్స్య సహకార సంఘం ఎన్నికలు నిర్వహించాలని కలెక్టర్ గౌతమికి ఏపీ సంప్రదాయ మత్స్యకారుల సంఘం, బెస్తసేవా సంఘం నాయకులు విన్నవించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌ను సంఘం నాయకులు కె.వి.రమణ, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, నాగార్జున, నాగరాజు తదితరులు కలసి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. ఏళ్లుగా జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా కొందరు మాత్రమే ఏకగ్రీవంగా ఎన్నికవుతూ వస్తున్నారన్నారు. వీరంతా తమకు అనుకూలంగా ఉన్న సంఘాలను మాత్రమే మనుగడలో ఉంచి, మిగిలిన వాటిని రద్దు చేస్తూ వచ్చారన్నారు. దాదాపు 30 సంఘాలకు ఓటు హక్కు లేకుండా చేశారన్నారు. అక్రమంగా ఓటు హక్కు తొలగించిన సంఘాల గుర్తింపును పునరుద్ధరించిన తర్వాత ఎన్నికలు జరిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

3న కోటంకలో రాష్ట్రస్థాయి భజన పోటీలు

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటికింద సుబ్బరాయుడు స్వామి ఆలయంలో డిసెంబర్ 3న కార్తీక దీపోత్సవాన్ని పురస్కరించుకుని అదే రోజు రాత్రి రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సుబ్బిరెడ్డి, ఆలయ ఈఓ బాబు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పోటీల్లో పాల్గొనే భజన బృందం రూ.300 ప్రవేశ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. దాదాపు 11 స్థానాల్లో విజేత బృందాలను ప్రకటించి, సభ్యులను నగదు పురస్కారాలతో సత్కరించనున్నారు. పూర్తి వివరాలకు 78010 35551, 94916 61919లో సంప్రదించవచ్చు.

జిల్లా ప్రగతి పరుగు

- జిల్లా పరిషత్ పరిధిలో రెండేళ్ల వ్యవధిలో అభివృద్ధి పనులకు రూ.28.54 కోట్లు
- రూ.7.62 కోట్ల సాధారణ నిధులతో వివిధ పనులు
- పారిశుద్ధ్యం, తాగునీటి అవసరాలకు రూ.8.40 కోట్లు
- రహదారులు, కల్వర్టులు, భవన మరమ్మతులకు రూ.12.52 కోట్లు

ఏ ఊరెళ్లినా తాగునీటికి కటకట.. ఎటు చూసినా అపరిశుభ్రత.. ఎటెళ్లినా కంకర తేలి, పాడైన రహదారులు, పుటుక్కుమని తెగిపడే కల్వర్టులు.. కూలేందుకు సిద్ధంగా ఉన్న ప్రభుత్వ భవనాలు.. ఇదీ గత టీడీపీ హయాంలోని జిల్లా దుస్థితి. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లె సీమల రూపురేఖలు మారిపోయాయి. జిల్లా పరిషత్‌కు పాలక వర్గం ఏర్పాటైన రెండేళ్లలోనే అభివృద్ధి పరుగులు తీసింది. ప్రతి పల్లె ప్రగతి పథంలో పయనిస్తోంది. అన్ని హంగులతో పల్లె సీమలు అలరారుతున్నాయి.

అనంతపురం సిటీ: ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి. జెడ్పీ చైర్‌పర్సన్‌గా గిరిజమ్మ పగ్గాలు చేపట్టిన తర్వాత గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఫలితంగా గత 20 ఏళ్లల్లో జరగని అభివృద్ధి కేవలం రెండేళ్లలోనే సాధ్యమైంది. ప్రజల అవసరాలను గుర్తించి, వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కారానికి ఆమె చూపుతున్న చొరవ ఫలితంగా మౌలిక సదుపాయాలు సమకూరుతున్నాయి.

ప్రమాణస్వీకారం రోజు నుంచే..

2021, సెప్టెంబర్ 25న జెడ్పీ చైర్‌పర్సన్‌గా గిరిజమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. అదే ఏడాది అక్టోబర్, 10 నుంచి అధికారిక బాధ్యతలు చేపట్టారు. వెనువెంటనే 63 మండలాల జెడ్పీటీసీ సభ్యులను సమన్వయం చేసుకుని మండలాల వారీగా సమస్యలను నివేదిక రూపంలో తెప్పించుకున్నారు. వాటిని ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగారు.

రూ.కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు

అక్షర క్రమంలోనే కాదు.. వైశాల్యంలోనూ పెద్ద జిల్లాగా గుర్తింపు పొందిన ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో ఒకప్పుడు సమస్యలూ అధికమే. వీటన్నింటినీ అధిగమించేలా జగన్ సర్కార్ జిల్లా సమగ్రాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలోనే అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనకు రూ. కోట్ల మేర నిధులు మంజూరు చేస్తూ వచ్చింది. ప్రజాధనంలో ప్రతి పైసాకు జెడ్పీ చైర్‌పర్సన్ జవాబుదారీగా ఉంటూ అభివృద్ధి పనులను పారదర్శకంగా పూర్తి చేయిస్తూ వచ్చారు. జనరల్ ఫండ్ సహ 15వ ఆర్థిక సంఘం కింద రూ.7.62 కోట్లతో వివిధ రకాల అభివృద్ధి పనులు పూర్తి చేశారు. పారిశుద్ధ్యం, తాగునీటి అవసరాలకు రూ.8.40 కోట్లు వెచ్చించారు. మరో రూ.12.52 కోట్లతో రహదారులు లేని గ్రామాలకు రోడ్లు వేయించారు. కల్వర్టులు నిర్మించారు. పాడైన రహదారులు, కల్వర్టులకు మరమ్మతులూ చేయించారు. కూలేందుకు సిద్ధంగా ఉన్న ప్రభుత్వ భవనాల మరమ్మతుకూ చర్యలు చేపట్టారు.



పామిడి మండలం వంకరాజుకాలువలో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి ట్యాంక్



కమలాపురం-కృష్ణాపురం గ్రామాల మధ్య వేసిన తారు రోడ్డు

ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో..

జిల్లా సమగ్రాభివృద్ధిలో ఉమ్మడి జిల్లాలోని జెడ్పీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులు, ప్రభుత్వాధికారులు, ఉద్యోగులందరినీ సమన్వయం చేసుకుని ముందుకు సాగడంతో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నివిధాలా సక్సెస్ అయ్యారు. పరస్పర సహకారంతో అభివృద్ధికి బాటలు వేశారు. మండలాల వారీగా జెడ్పీటీసీలను పిలిపించుకుంటూ ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. ఆయా పనుల పూర్తికి అధికారులతో నివేదికలు తెప్పించుకుని నిధులు మంజూరు చేస్తూ వెళ్లారు.

'అనంత'దే అగ్రస్థానం



రాష్ట్రంలోనే ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధిలో దూసుకుపోతోంది. అధికారులు, జెడ్పీటీసీ సభ్యుల సహకారం మరువలేను. ముఖ్యంగా జిల్లా సమస్యలను ప్రస్తావించి, అదనపు నిధులు అడిగినప్పుడల్లా సానుకూలంగా స్పందిస్తూ వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటా. రాబోవు మూడేళ్లలో జిల్లాలో మరిన్ని అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం.

– గిరిజమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్

మరింత అభివృద్ధికి ప్రణాళిక

గిరిజమ్మ పదవీ కాలం మరో మూడేళ్లు ఉంది. ఈ మూడేళ్లలో ఏమేం అభివృద్ధి పనులు చేపట్టాలనే అంశాలను ఇప్పటికే ఆమె సిద్ధం చేసుకున్నారు. ఆయా పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు, వాటిని సమీకరించుకోవడంపై ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు.

జనవాక్కు

సొంతింటి కల నెరవేరింది



మేము కొన్నేళ్లుగా అద్దె ఇంట్లోనే ఉంటున్నాం. సొంతింటి కోసం తెలుగుదేశం హయాంలో అర్జీలు పెట్టుకొని కాళ్లరిగేలా తిరిగాము. అయితే జగనన్న ప్రభుత్వంలో వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకున్నాం. ఇళ్ల మంజూరైందని చల్లని తీపి కబురు చెప్పారు. పట్టా కూడా చేతికి ఇచ్చారు. ఇల్లు కట్టుకున్నాం. దీంతో ఎన్నో ఏళ్ల మా సొంతింటి కల నెరవేరింది. మా లాంటి పేదలకు ప్రభుత్వమే సాయం చేసి చేదోడు వాదోడుగా నిలుస్తోంది.

– రామేశ్వరి, అచ్యుతాపురం, యల్లనూరు మండలం

ఆరోగ్యశ్రీతోనే బతికి బయటపడ్డా



కూలి పనిచేస్తేనే మాకు పూట గడుస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో నాకు కడుపులో గడ్డలు ఉండి కడుపునొప్పి ఎక్కువగా ఉండేది. వైద్యుల వద్దకు వెళ్లగా కడుపులో గడ్డల వల్ల నీకు కడుపునొప్పి, నెలసరి ముట్టు వల్ల ఇబ్బందులు జరుగుతున్నాయని చెప్పారు. నా సమస్య ఎలా పరిష్కరించుకోవాలా అని ఆలోచించా. అంతలోనే మా గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు ఏర్పాటు చేశారు. అక్కడ వైద్యులను సంప్రదించగా పరిష్కారం దొరికింది. అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేసి గడ్డలను తొలగించారు. పిల్లలు, భర్తతో సంతోషంగా ఉన్నాను. ఈ ఆరోగ్యశ్రీ నే మా ప్రాణం నిలబెట్టింది. ఇప్పుడు నా ఆరోగ్యం బాగుంది.

– బండి పుల్లమ్మ ,బొప్పేపల్లి, యల్లనూరు మండలం

ఇల్లు మంజూరైంది



మా ఊళ్లో ఇప్పటి వరకూ సొంతిల్లు లేని ప్రతి ఒక్కరికీ జగన్ ప్రభుత్వం పక్కా గృహాలు నిర్మించి ఇస్తోంది. నాకూ ఓ ఇల్లు మంజూరైంది. నిర్మాణ పనులు పూర్తి కావొచ్చాయి. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం అధికారుల చుట్టూ తిరిగినా అప్పట్లో మాకు న్యాయం చేకూరలేదు. జగన్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వలంటీర్ మా వద్దకు వచ్చి ధ్రువీకరణ పత్రాలు తీసుకెళ్లి ఇంటి పట్టా తెచ్చిచ్చాడు. ఆ స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు అధికారులు అన్ని విధాలుగా సహకరిస్తున్నారు. త్వరలో గృహ ప్రవేశం చేయబోతున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది.

– వెంకట్రాముడు, కొత్తపేట, గుత్తి మండలం

ప్రాణం పోశారు



నేను, నా భర్త చంద్రాయుడు, ముగ్గురు పిల్లలు కలసి జీవిస్తున్నాం. కూలి పనులే జీవనాధారం. 2020లో నాకు తీవ్ర గుండె నొప్పి వచ్చింది. డాక్టర్‌ను సంప్రదిస్తే గుండె ఆపరేషన్ చేయాలన్నారు. విషయం తెలుసుకున్న ఆరోగ్యమిత్ర బాబు మా ఇంటి వద్దకు వచ్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కర్నూలులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించి రూ.1.50 లక్షలు విలువ చేసే శస్త్ర చికిత్స చేయించారు. ఇందు కోసం నయాపైసా ఖర్చు కాలేదు. పైగా మందులు, ఇతర అవసరాలకు రూ.10వేలు ఇచ్చారు. ప్రస్తుతం నా ఆరోగ్యం కుదుట పడింది.కుట్టు పనితో రోజూ రూ.300 వరకూ సంపాదిస్తున్నా. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నాకు ప్రాణం పోసిన సీఎం వైఎస్ జగన్ మేలు మరువలేం.

– నాగమ్మ, నెహ్రూ కాలనీ, పామిడి

చీటీల పేరుతో కుచ్చుటోపీ

- 60 మందిని మోసగించి ఉడాయించిన నిర్వాహకుడు
- 'పోలీసు స్పందన'లో బాధితుల ఫిర్యాదు



నిర్వాహకుడిపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు

అనంతపురం క్రైం: చీటీల పేరుతో మోసగించిన వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకుని తమ డబ్బు ఇప్పించాలంటూ పోలీసులను బాధితులు ఆశ్రయించారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్.వి జయభాస్కరరెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎస్పీ కార్యాలయ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. ఆర్డీటీలో పనిచేస్తున్న 60 మంది తోటమాలులతో రాయదుర్గం ప్రాంతానికి చెందిన చీటీల నిర్వాహకుడు వన్నూరు అనే వ్యక్తి సన్నిహితంగా ఉండేవాడు. ఈ క్రమంలోనే ఒక్కొక్కరితో మూడు, నాలుగు చొప్పున చీటీలు వేయించుకున్నాడు. ఒక్కో చీటీకి 30 మందికి పైగా సభ్యులు ఉన్నారు. ఈ లెక్కన మొత్తం నాలుగు చీటీలు నిర్వహిస్తూ వారం రోజుల క్రితం రాత్రికి రాత్రి ఇల్లు ఖాళీ చేసి ఉడాయించాడు. వెళ్లే సమయంలో ఓ మహిళతో నాలుగు తులాల బంగారు నగలు, రూ. 2 లక్షలు నగదు, మరొకరితో రూ.లక్ష చొప్పున తనకు అనువుగా ఉన్న వారందరితో డబ్బు, నగలు తీసుకుని పరారయ్యాడు. విషయం తెలుసుకున్న బాధితులు అతని సొంతూరుకు వెళ్లినా ఫలితం లేకపోవడంతో సోమవారం పోలీసు స్పందన కార్యక్రమానికి ఫిర్యాదు చేశారు. స్పందించిన అదనపు ఎస్పీ విజయబాస్కరరెడ్డి మాట్లాడుతూ... బాధితులకు న్యాయం చేస్తామని భరోసానిచ్చారు. కాగా, పోలీసు స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 119 వినతులు అందినట్లు ఏఎస్పీ తెలిపారు. సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలంటూ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

రైతును రారాజును చేయాలన్నదే సీఎం లక్ష్యం

- మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్ (చిత్రంలో) మాజీ ఎమ్మెల్యే విశ్వ

కూడేరు: అన్నదాతను రారాజును చేయాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, ఇందులో భాగంగా రైతు సంక్షేమానికి అనేక పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నారని మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ అన్నారు. కూడేరు మండలం పి.నారాయణపురం – తిమ్మాపురం గ్రామాల మధ్య సుమారు రూ.3.5 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే వ్యవసాయం సుభిక్షంగా సాగుతోందన్నారు. పంటల సాగుకు విద్యుత్ సమస్య లేకుండా చేశారన్నారు. లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 43 సబ్ స్టేషన్లను ప్రభుత్వం మంజూరు చేసిందని గుర్తుచేశారు. ఒక్క ఏడాదిలోనే ఇన్ని సబ్‌స్టేషన్లు మంజూరు కావడం ఏపీ చరిత్రలోనే లేదన్నారు. ఆర్‌బీకేల ఏర్పాటుతో రైతు ముంగిటకే సేవలు అందుతున్నాయన్నారు. టీడీపీ పాలనలో వ్యవసాయాన్ని దండగ అంటూ పేర్కొన్న అప్పటి సీఎం చంద్రబాబు... అదే దిశలో అన్నదాతల బతుకులు ఛిద్రం చేస్తూ వచ్చారన్నారు. ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ... నూతన సబ్ స్టేషన్ ప్రారంభంతో తిమ్మాపురం, పి.నారాయణపురం, చోళసముద్రం, జయపురం గ్రామాలతో పాటు ఆత్మకూరు మండలంలోని పలు గ్రామాలకు లో-ఓల్టేజీ సమస్యల పరిష్కారమవుతోందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్‌ఈ సురేంద్ర, సర్పంచ్‌లు హనుమంతరెడ్డి, ఓబుళమ్మ, ఎంపీపీ నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు తుప్పటి అశ్వని, వైస్ ఎంపీపీ సుబ్బమ్మ, అగ్రి అడ్వైజరీ మండల కమిటీ చైర్‌పర్సన్ నిర్మలమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీఓ ఎంకే బాషా, ఏఓ విజయకుమార్, ట్రాన్స్‌కో ఏఈ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

కొండుపల్లి గనుల పరిశీలన

పెద్దవడుగూరు: మండలంలోని కొండుపల్లి గనులను నెల్లూరు మైనింగ్ సేఫ్టీ అధికారి కె.ఎ.నాయుడు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ.. గనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనుమతులు లేకుండా ఖనిజాన్ని వెలికి తీస్తున్న వారి వివరాలు ఆరా తీశారు. ప్రమాదం జరిగిన గనిని పరిశీలించారు. ఘటనపై నివేదిక రూపొందించి, ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

అల్లుడిపై మామ దాడి

కళ్యాణదుర్గం: ఇల్లరికం వచ్చేందుకు ఇష్టపడని అల్లుడిపై మామ దాడి చేశాడు. వివరాలు.. కళ్యాణదుర్గం మండలం కొత్తూరుకు చెందిన నరసింహులు కుమార్తె గోవిందమ్మ, కంబదూరు మండలం జక్కిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సిద్దయ్య ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ప్రస్తుతం ఓ కుమార్తె ఉంది. కొన్ని రోజుల క్రితం గోవిందమ్మ పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో తన భార్యను పిలుచుకెళ్లేందుకు ఆదివారం సిద్దయ్య కొత్తూరుకు చేరుకున్నాడు. రాత్రి మామ నరసింహులుతో మాట్లాడుతూ తన భార్యను కాపురానికి పిలుచుకెళుతానని తెలిపాడు. దీంతో నరసింహులు తన కుమార్తెను పంపడం కుదరదని తేల్చి చెప్పాడు. అల్లుడిని కూడా తన ఇంట్లోనే ఇల్లరికం ఉండాలన్నాడు. ఇందుకు సిద్దయ్య అంగీకరించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ పక్కనే ఉన్న కర్రతో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన సిద్దయ్యను వెంటనే కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ఘటనపై తమకు ఎలాంటి సమాచారం లేదని పోలీసులు పేర్కొన్నారు.

ఎస్‌ఆర్‌ఐటీ విద్యార్థికి డీజీ కమెండేషన్ అవార్డు



ఆశ్రిత

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురం వద్ద ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్) కళాశాలలో సీఎస్‌ఎం తృతీయ సంవత్సరం విద్యార్థిని, ఎన్‌సీసీ క్యాడెట్ ఆశ్రితకు డీజీ కమెండేషన్ అవార్డు దక్కింది. 2024, జనవరి 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆంధ్ర, తెలంగాణ ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమాండర్ వి.ఎం.రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డును ఆమె అందుకోనున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ సోమవారం వెల్లడించారు. లెఫ్టినెంట్ కల్నల్ సుమిత నేతృత్వంలో శిక్షణ పొందిన ఆశ్రిత.. రాయ్‌పూర్‌లోని లఖోలీలో జరిగిన అడ్వాన్స్ లీడర్ షిప్ శిక్షణా శిబిరంలో కనబరిచిన అత్యంత ప్రతిభకు అవార్డు దక్కినట్లు వివరించారు.

అంతర్జాతీయ సదస్సులో అనంత వైద్యుడి ప్రసంగం



డాక్టర్ కార్తీక్

అనంతపురం మెడికల్: అత్యంత ఆధునిక రోబోటిక్ శస్త్ర చికిత్సల ఆవిష్కరణపై 'రోబోకాన్-2023' పేరుతో హైదరాబాద్‌లో రెండ్రోజులుగా జరిగిన అంతర్జాతీయ సదస్సులో నార్పలకు చెందిన డాక్టర్ కార్తీక్ ప్రసంగం ఆకట్టుకుంది. కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్, ఉస్మానియాలో ఎంఎస్ ఆర్థోపెడిక్ పూర్తి చేసిన ఆయన రోబోటిక్ టెక్నాలజీలో వచ్చే చిక్కులు, గాయం తక్కువగా ఉండి ఎముకలను సరిచేయడం వంటివాటిపై ప్రసంగించారు. మోకాలి శస్త్రచికిత్సల కోసం అందుబాటులో ఉన్న ఐదు రకాల రోబోటిక్ పద్ధతులను ఒకేచోట చేర్చి వివరించారు. డాక్టర్ కార్తీక్ మాట్లాడుతూ ఇలాంటి సదస్సుల్లో పాల్గొనే అవకాశం రావడం వల్ల కొత్త విషయాలు తెలుసుకోవడంతో పాటు రోగులకు మరింత మెరుగైన, అత్యాధునిక వైద్యం ఎలా చేయాలో అవగాహన కలుగుతుందని అన్నారు.

మతసామరస్యానికి ప్రతీక దర్గా హొన్నూరు

- రేపటి నుంచి ఉరుసు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

బొమ్మనహాళ్: ఉమ్మడి తెలుగు రాష్ట్రంలోనే మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన దర్గాల్లో ఒక్కటైన బొమ్మనహాళ్ మండలంలోని దర్గాహొన్నూరులో వెలసిన హజరత్ ఖ్వాజా సయ్యద్ షా సూఫీ శర్మస్త్ హుస్సేనీ చిస్తీ స్వామి ఉరుసు ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు దర్గా కమిటీ సభ్యులు వెల్లడించారు.

హిందూముస్లింల ఐక్యతకు నిదర్శనం

హిందూముస్లింల ఐక్యతకు నిదర్శనంగా దర్గాహొన్నూరులో వెలసిన హజరత్ ఖ్వాజా సయ్యద్ షా సూఫీ శర్మస్త్ హుస్సేనీ చిస్తీ ఉత్సవాలు ప్రతి ఏటా జరుగుతుంటాయి. ఈ ఏడాది 345వ ఉరుసు ఉత్సవాలకు నిర్వాహకులు దర్గాను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈ దర్గాకు ఉమ్మడి తెలుగు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాక మహారాష్ట్ర, తమిళనాడు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఉరవకొండ, కణేకల్లు, విడపనకల్లు, కళ్యాణదుర్గం, వజ్రకరూరు, గుంతకల్లు, రాయదుర్గం, గుమ్మఘట్ట, డి.హీరేహాళ్, బెళుగుప్ప మండలాలతో పాటు కర్ణాటకలోని బళ్లారి, మొలకాల్మూరు, రాంపురం, హొసపేట ప్రాంతాల్లోని హిందూ, ముస్లింలు తమ ఇలవేల్పుగా స్వామిని కొలుస్తుంటారు. కాగా, ఏటా ఉరుసు సమయంలో భక్తుల తాకిడి పెరుగుతుండడంతో ఈ ఏడాది ప్రత్యేక బస్సులు నడపాలని భక్తులు కోరుతున్నారు.



స్వామి సమాధి

ఉత్సవాలు ఇలా...	
తేదీ	ఉత్సవం
29	గంధం
30	ఒకటవ దీపారాధన
1	రెండవ దీపారాధన
2	ఉరుసే షరీఫ్ (దేవుడి సవారీ)
3	జియారత్

గురువారం భక్తుల తాకిడి

హొన్నూరులోని దర్గాను సందర్శించేందుకు ప్రతి గురువారమూ వందలాది మంది భక్తులు వస్తుంటారు. ప్రత్యేక పూజలు, ప్రార్థనలు పెద్ద ఎత్తున సాగుతాయి. పిల్లలను త్రాసులో ఉంచి అందుకు సమానంగా చక్కెర, పొడి బెల్లంతో స్వామికి మొక్కులు తీర్చుకుంటారు. తమ ఇలవేల్పుగా కొలిచేవారు ఇంటిలో పిల్లలకు స్వామి పేరు పెడుతుండడం గమనార్హం.

లారీల సీజ్

గుత్తి రూరల్: నకిలీ వే బిల్లులతో గుజరీ సామగ్రిని తరలిస్తున్న ఐదు లారీలను సేల్స్ ట్యాక్స్ అధికారులు ఆదివారం రాత్రి సీజ్ చేశారు. వైఎస్సార్ జిల్లా నుంచి కర్నూలు జిల్లా మంత్రాలయానికి గుజరీ వస్తువుల లోడ్‌తో బయలుదేరిన ఐదు లారీలను గుత్తి మండలం కొత్తపేట శివారులో బైపాస్ వద్ద సేల్స్ ట్యాక్స్ అధికారులు అడ్డుకుని రికార్డులు పరిశీలించారు. అనంతపురం నుంచి సరుకు రవాణా చేస్తున్నట్లు రికార్డులు ఉంది. కాటా మాత్రం వైఎస్సార్ జిల్లా కడపలో వేయించారు. దీంతో ఐదు లారీలను సీజ్ చేసి గుత్తి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఒక్కో లారీకి రూ.1.80 లక్షలు చొప్పున ఐదు లారీలకు రూ.9 లక్షల మేర జరిమానా విధించారు.



సీజ్ చేసిన లారీలు

వలస కూలీ మృతి

కళ్యాణదుర్గం: బతుకు తెరువు కోసం వలస వచ్చిన ఓ కూలీ పని ప్రాంతంలో గుండెపోటుకు గురై మృతి చెందాడు. వివరాలు... కంబదూరు మండలం గుద్దెళ్ల గ్రామంలో ఓ రైతు పొలంలో పని కోసం రైల్వే కోడురుకు చెందిన మేస్త్రీ శివయ్య ఆ ప్రాంతానికి చెందిన పది మంది కూలీలను పిలుచుకుని వచ్చాడు. సోమవారం ఉదయం పొలం పనిలో నిమగ్నమైన రైల్వే కోడూరు నివాసి శంకర్ (45) తనకు ఛాతిలో నొప్పిగా ఉందంటూ తెలపడంతో తోటి కూలీలు వెంటనే కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి పిలుచుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే శంకర్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కంబదూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

కోర్టు భవన సముదాయానికి నిధులు ఇవ్వండి



ఆర్థికమంత్రి బుగ్గనకు వినతిపత్రం అందిస్తున్న ఆలూరి రామిరెడ్డి

అనంతపురం: జిల్లా కోర్టులో నూతన భవన సముదాయానికి రూ.20 కోట్ల నిధులు మంజూరు చేయాలని ఏపీ ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు ఆలూరు రామిరెడ్డి తదితరులు కోరారు. ఈ మేరకు డోన్‌లోని మంత్రి నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. నిధులు సత్వరమే విడుదల చేసేందుకు వీలుగా చర్యలు తీసుకుంటామని ఆర్థిక మంత్రి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఆలూరి రామిరెడ్డి , పబ్లిక్ ప్రాసిక్యూటర్ హరినాథ్‌రెడ్డి, అఫీషియల్ రిసీవర్ జి. నరసింహులు యాదవ్ పాల్గొన్నారు.

నేడు 'వై ఏపీ నీడ్ జగన్'

ఆత్మకూరు: ఆత్మకూరు సచివాలయం-2 లో 'వై ఏపీ నీడ్ జగన్' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ లక్ష్మీనరసింహులు ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మధ్యాహ్నం 2 గంటలకు రావాలని కోరారు.

అభివృద్ధి పనుల పరిశీలన



కాలువ పనులు పరిశీలిస్తున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి, కోగటం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 13,14వ డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ డివిజన్‌లో రూ.1.96 కోట్లతో సిమెంట్ రోడ్డు, రూ.28 లక్షలతో కాలువ, రూ.66 లక్షలతో (ఆర్డీటీ నిధులు) లతో బ్రిడ్జి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్పొరేటర్లు కమల్‌భూషణ్, అబూసలేహా, డీఈ చంద్రశేఖర్, ఏఈ బాబావలి, నాయకులు దాదు తదితరులు పాల్గొన్నారు.

30న కనకదాస జయంతి

అనంతపురం టవర్‌క్లాక్: రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 30న కనకదాస జయంతిని పండుగలా జరుపుకుందామని కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా భక్తకనకదాస జయంతిని ప్రతి గ్రామంలోనూ కురుబలు ఐక్యతతో జరుపుకోవాలన్నారు.

కుష్టును ప్రారంభ దశలోనే గుర్తించాలి



మాట్లాడుతున్న డాక్టర్ అనుపమజేమ్స్

అనంతపురం మెడికల్: కుష్టును ప్రారంభదశలోనే గుర్తించి, వైద్యం అందించాలని కుష్టు విభాగం జిల్లా అధికారి డాక్టర్ అనుపమజేమ్స్ తెలిపారు. సోమవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వమించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యాక్రమంలో జరుగుతున్న శిబిరాల్లో డిప్యూటీ పారామెడికల్ అధికారులు పాల్గొని, కుష్టుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కుష్టు బాధితులు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, 6 నెలలు, ఏడాది కాలం మందులు వాడితే ఏదశలో ఉన్నా నయమవుతుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వచ్చిన అనుమానిత కేసులకు స్క్రీనింగ్ చేయాలన్నారు. కొత్త కేసులు నమోదైన ప్రాంతాల్లో సర్వే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శివారెడ్డి, పారామెడికల్ అధికారి నాగన్న, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సత్యనారాయణ, డిప్యూటీ పారా మెడికల్ అధికారి సూర్య ప్రకాష్, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

భోగేశ్వరుడికి ప్రత్యేక పూజలు



పామిడిలో అలంకరణలో భోగేశ్వరుడు

పామిడి: పట్టణంలోని ప్రముఖ శైవక్షేత్రమైన భోగేశ్వరాలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మూలవిరాట్ భోగేశ్వరుడిని సుందరంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మంగళ హారతి అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం లక్షదీపారాధన జ్వాలాతోరణ మహోత్సవం నిర్వహించారు.

హరహర మహాదేవ శంభో శంకర





నగరంలోని మూడో రోడ్డులోని బాబా మందిరంలో సత్యదేవుడి వ్రతాలు నిర్వహిస్తున్న అర్చకులు, మొదటిరోడ్డులో కార్తీక దీపాలు వెలిగిస్తున్న దృశ్యం



పూజలందుకున్న మహేశ్వరుడు



ఆత్మకూరులో వాసవీమాత ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

అనంతపురం కల్చరల్ /అనంతపురం/ఆత్మకూరు : నగరంలోని శైవక్షేత్రాలు హరహర మహాదేవ శంభో శంకర అంటూ భక్తుల శరణు ఘోషతో మార్మోగాయి కార్తీకమాసంలో వచ్చిన పవిత్ర పౌర్ణమికి తోడు సోమవారం కలిసి రావడంతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున నుంచే మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం వేదమంత్రాలతో శ్రవణానందం చేసింది. పాతూరులోని ప్రాచీన విరూపాక్షేశ్వరాలయం, శివకోటి, శారదా శృంగేరీ శంకరమఠం, శివబాలయోగి ఆశ్రమం, సర్వేశ్వరాలయం, మంజునాథ అన్నపూర్ణేరీ దేవస్థానంలో సామూహిక నోములు, జ్వాలాతోరణాలు వెలిగించారు.

కాశీకాళభైరవేశ్వర స్వామి ఆలయంలో..

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీ బంగ్లా ఎదురుగా ఉన్న కాశీకాళభైరవేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా అర్చకులు వేణుగోపాలస్వామి విశేష పూజలు నిర్వహించారు. స్వామి మూలవిగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా వర్సిటీ విద్యార్థినులు పెద్ద ఎత్తున హాజరై కార్తీక దీపాలు వెలిగించారు.

ఆత్మకూరు మండలంలోని పలు ఆలయాల్లో కార్తీక పూజలు నిర్వహించారు. పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలోని మంజునాథస్వామికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి,



ఆత్మకూరులో అలంకరణలో మంజునాథుడు





ఎస్కేయూ వద్దనున్న కాశీకాళభైరవేశ్వర ఆలయంలో వెలిగించిన కార్తీక దీపాలు

పూజలు నిర్వహించారు. ఆత్మకూరులోని శివాలయంలో స్వామికి పూజలు చేశారు. ఆత్మకూరులోని వాసవీమాత ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో సత్యదేవుడి వ్రతాలు ..

నగరంలోని పలు ఆలయాల్లో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం స్థానిక మూడో రోడ్డులోని షిర్డీసాయి బాబా మందిరం, రాఘవేంద్రస్వామి మఠంలో వేదపండితులు సత్యదేవుడి వ్రతాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అభిషేకాలు, అలంకార సేవలు నిర్వహించారు. వేమన టెలిఫోన్ భవన్ బాబా మందిరం, సత్యదేవనగర్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయం, రమాదేవి సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు.

ఘనంగా రెడ్డి కార్తీక వనభోజనాలు



హోమాలు నిర్వహిస్తున్న వేదపండితులు

చెన్నేకొత్తపల్లి: స్థానిక కనుమ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా రెడ్డి సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాల కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు వేద పండితులతో కార్తీక దామోదర హోమం, గణపతి హోమం , రాజశ్యామల హోమం నిర్వహించారు. ఈ పుణ్య కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హాజరై, వేదపండితుల ఆశీర్వాచనాలను అందుకున్నారు. అనంతరం రెడ్డి కులస్తులు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



వేదపండితులతో ఆశీర్వాదం పొందుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

చియ్యేడు గ్రామానికి రూ.24 కోట్ల లబ్ధి



చియ్యేడు గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం చియ్యేడు గ్రామానికి వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ. 24 కోట్ల లబ్ధి జరిగిందని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. సోమవారం గ్రామంలో గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రం, అంగన్‌వాడీ భవనాలను ప్రారంభించారు. అనంతరం 'గడప గడపకూ మన ప్రభుత్వం', 'జగనన్న ప్రజా సంక్షేమ సదస్సు' కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చియ్యేడు గ్రామానికి చంద్రబాబు హయాంలో ఏమి లబ్ధి జరిగిందో చెప్పాలని ప్రజలను అడిగారు. గ్రామంలో 11 కేవీ లైను మార్చాలని గ్రామస్తులు అడుగుతున్నారని, తన సొంత నిధులతో మార్పిస్తానని హామీ ఇచ్చారు.

జగనన్న మనసుతో పరిపాలన సాగిస్తున్నారు..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేదలకు సాయం చేయాలనే పెద్ద మనసు ఉందని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి అన్నారు. పేదలను గుండెల్లో పెట్టుకొని చూసుకోవాలనే తపన ఉందని, మనసుతో పరిపాలన సాగిస్తున్నారన్నారు. దళిత, గిరిజన, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల వారిని ఉన్నత స్థానాల్లో కూర్చోబెట్టారని, జనాభా ప్రాతిపదికన కులగణన చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేశారన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా చియ్యేడు గ్రామస్తులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబం వెంటే నడిచారన్నారు. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అందరూ గర్వపడేలా పాలన సాగిస్తున్నారన్నారు. అందరి సంక్షేమం కోరుతూ మంచి సుపరిపాలన సాగించిన జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ చెన్నయ్య, స్థానిక నాయకులు రామకృష్ణ, సుబ్బారెడ్డి, చలపతి, రవీంద్రరెడ్డి, మాజీ సర్పంచ్ యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

రేపు నాగత్రిశూలపాణి సంస్మరణ సభ

అనంతపురం కల్చరల్: ప్రముఖ సంస్కృత పండితుడు, రామకృష్ణ సేవా సమితి ప్రతినిధి డాక్టర్ నాగత్రిశూలపాణి సంస్మరణ సభ ఈనెల 29న జరగనున్నట్లు నిర్వాహకులు గుత్తి శ్రీధర్‌మూర్తి, కాశీవిశ్వేశ్వరశర్మ తెలిపారు. హెచ్చెల్సీ కాలనీలోని శ్రీరామకృష్ణ సేవా సమితి ప్రాంగణంలో బుధవారం ఉదయం 10 నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వైఎస్సార్ జిల్లా రామకృష్ణ మిషన్ నుంచి పరమపూజ్య స్వామి అనుపమానంద మహారాజ్, రాయలసీమ భావ ప్రచార పరిషత్తు శివరామిరెడ్డి హాజరవుతారన్నారు.

సబ్ రిజిస్ట్రార్ మృతిపై విచారణ జరిపించాలి

అనంతపురం టవర్‌క్లాక్: సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు నాయక్‌పై మృతిపై అనుమానాలు నిగ్గుతేల్చాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి కోరారు. సోమవారం స్థానిక సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం సాకే హరి మాట్లాడుతూ బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు నాయక్ ఆత్మహత్యకు రాజకీయ, రియల్ ఎస్టేట్ వ్యాపారుల బెదిరింపులే కారణమన్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలన్నారు. బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్‌ను విలువైన భూములను అక్రమంగా, అడ్డగోలుగా రిజిస్ట్రేషన్ చేయాలని పలు దఫాలుగా ఒత్తిడి తెచ్చారన్నారు. ఆయన తన కుటుంబ సభ్యులతో రియల్టర్ల వేధింపుల గురించి తెలిపినట్లు సమాచారం ఉందన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా



ఇమ్రాన్ అలీ

శింగనమల: ఈనెల 23 నుంచి 25 వరకూ కర్నూలులో జరిగిన అండర్-17 రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో శింగనమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఇమ్రాన్ అలీ సత్తా చాటాడని హెచ్‌ఎం సుజాతమ్మ, పీడీ నందకుమార్ తెలిపారు. ఈ పోటీల్లో విద్యార్థి ద్వితీయ స్థానం దక్కించుకోవడంతో సోమవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

మాజీ ఎమ్మెల్యే జగదీష్‌కు ప్రముఖుల సంతాపం



అంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే అనంత

గుంతకల్లు: గుత్తి మాజీ ఎమ్మెల్యే అరికేరి జగదీష్ గొప్ప రాజకీయ నాయకుడని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, వై.వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ విప్ వై.శివరామిరెడ్డి కొనియాడరు. పలువురు ప్రముఖులు ఆయన పార్థివదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, గుంతకల్లు ఎమ్మెల్యే వైవీఆర్, ఎమ్మెల్సీ విప్ శివరామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు ఎన్.రామలింగప్ప, జింకల రామాంజనేయులు, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ వీరాంజనేయులు, పలువురు కౌన్సిలర్లు తదితరులు ఆయన మృతదేహంపై పుష్పగుచ్చాలు, పూలమాలలు వేసి, నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు.

సాయినగర్‌లో చోరీ

అనంతపురం క్రైం: నగరంలోని సాయినగర్ రెండో క్రాస్‌లో నివాసం ఉంటున్న ఎస్కేయూ సీనియర్ అసిస్టెంట్ ఆనంద్‌బాబు ఇంట్లో దొంగలు 15 తులాల బంగారం, 20 తులాల వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు. వివరాలు.. ఆనంద్‌బాబు దంపతులు ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి, ఓ నిశ్చితార్థం వేడుకకు వెళ్లారు. సోమవారం మధ్యాహ్నం తిరిగి ఇంటికొచ్చి చూడగా తలుపులు తీసి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూస్తే బీరువాలో ఉంచిన బంగారంతో పాటు వెండి వస్తువులు కనిపించలేదు. దీనిపై బాధితులు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా బాధితులు 15 తులాలు బంగారం, 20 తులాల వెండి పోయినట్లు ఫిర్యాదు చేయగా, పోలీసులు 9 తులాల బంగారం, 15 తులాలు వెండి వస్తువులు పోయినట్లు కేసు నమోదు చేశారు.

టింబర్ డిపో కార్మికుడికి గాయాలు

అనంతపురం క్రైం: పాతూరు గుత్తిరోడ్డులోని టింబర్ డిపోలో పని చేసే కార్మికుడు రామచంద్రకు ప్రమాదవశాత్తూ మిషన్ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. తోటి కూలీలు అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శింగనమల మండలం చిన్నమట్లగొందికి చెందిన రామచంద్ర పాతూరులోని గుత్తిరోడ్డు ఓ టింబర్‌డిపోలో పని చేస్తున్నాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓటీ అసిస్టెంట్ పోస్టుల భర్తీపై అభ్యంతరాలు



నియామక ఉత్తర్వులు అందజేస్తున్న ఉమ్మడి జిల్లా డీసీహెచ్‌ఎస్‌లు డాక్టర్ పాల్ రవికుమార్, డాక్టర్ తిప్పేంద్ర నాయక్

అనంతపురం మెడికల్: ఏపీ వైద్య విధాన్ పరిషత్ పరిధిలోని ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల భర్తీకి సంబంధించి అర్హులైన అభ్యర్థుల కౌన్సిలింగ్ ప్రక్రియ సోమవారం ఉదయం డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో చేపట్టారు. ఉమ్మడి జిల్లా డీసీహెచ్‌ఎస్‌లు డాక్టర్ పాల్ రవికుమార్, డాక్టర్ తిప్పేంద్ర నాయక్ పాల్గొని అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కాగా, ఓటీ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించి కొందరు అభ్యంతరాలు లేవనెత్తారు. అర్హత సాధించిన అభ్యర్థుల్లో కొందరు విద్యాభ్యాసం చేస్తూనే సేవా అనుభవం (ఎక్స్‌పీరియన్స్) ధ్రువీకరణ పత్రాలు పొందుపరిచినట్లు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయం గందరగోళానికి దారి తీసింది. నకిలీ సర్టిఫికెట్లతో కౌన్సిలింగ్‌కు హాజరైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీసీహెచ్‌ఎస్ ప్రకటించడంతో పలువురు స్వచ్ఛందంగా వైదొలిగారు. అలాగే ఒకేవొక రేడియోగ్రాఫర్ పోస్టుకు సంబంధించి అభ్యర్థులెవరూ హాజరుకాలేదు. దీంతో ఆ పోస్టు భర్తీని వాయిదా వేశారు. మొత్తం 56 పోస్టులకు గానూ జనరల్ డ్యూటీ అటెండెంట్ 28, ప్లంబర్లు 5, ఓటీ అసిస్టెంట్లు 8, ల్యాబ్ టెక్నీషియన్లు 2, ఫార్మసిస్టులు 2, పోస్టుమార్టం అసిస్టెంట్లు 3, ఆడియోమెట్రీ 1, ఆఫీస్ సబార్డినేట్ 1, మెడికల్ రికార్డు అసిస్టెంట్ 2 తదితర పోస్టులకు కౌన్సిలింగ్ నిర్వహించి అర్హత సాధించిన వారికి నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో ఏఓ ఉదయభాస్కర్, సీనియర్ అసిస్టెంట్ నాగార్జున, జూనియర్ అసిస్టెంట్ చరణ్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి

- రూ.56.25 కోట్లతో పనుల ప్రారంభానికి చర్యలు
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: మండలంలో జలజీవన్ మిషన్ ద్వారా రెండు విడతల్లో రూ.56.25 కోట్లతో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చొరవ తీసుకున్నట్లు ఎంపీపీ సుబ్బరహేమలత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూజారి లక్ష్మీనరసింహులు తెలిపారు. సోమవారం ఎంపీపీ చాంబర్‌లో విలేకర్లతో మాట్లాడారు. మండలంలో దశాబ్దాలుగా నీటి సమస్య ఉండగా, అప్పటి పాలకులుల పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చొరవతో జలజీవన్ మిషన్ నిధులు మొదటి విడతలోరూ.2.15 కోట్లతో 16 గ్రామాలకు గాను 1,600 ఇళ్లకు ఇంటింటికీ కొళాయి కనెక్షన్లు అందాయన్నారు. రెండో విడతలో రూ.54.10 కోట్లతో 25 గ్రామాల్లో నీటి సమస్య తీర్చేందుకు ఇటీవల టెండర్లు పూర్తయ్యాయని,త్వరలో పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పీఏబీఆర్ డ్యాం నుంచి మండల వ్యాప్తంగా పైప్‌లైన్లు వేయించి నీరు అందిస్తున్నట్లు తెలిపారు. 25 గ్రామాలల్లో 32 (ఓవర్ హెడ్ ట్యాంకులు) నిర్మిస్తున్నట్లు తెలిపారు. తండా గ్రామాల్లో 40 వేల లీటర్ల ట్యాంకులు, మిగిలిన చోట 60 లీటర్ల ట్యాంకులు, 90 లీటర్ల సామర్థ్యం గల నీటి ట్యాంకులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జీఎల్ఎస్ఆర్‌లో భాగంగా కుర్లపల్లిలో 40 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు, తోపుదుర్తిలో 2.50 లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు, ఆత్మకూరులో 8 లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పీఏబీఆర్ డ్యాం వద్ద 10 లక్షల లీటర్ల సామర్థం గల సంపు, కూడేరు మండలం నారాయణపురం వద్ద 10 లక్షల లీటర్ల సామర్థ్యంగల నీటి సంపు నిర్మించి నీరందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయ్, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి , నాయకులు పెద్ద కొండారెడ్డి, ఈశ్వరరెడ్డి, వన్నూరప్ప, వెంకట్రామిరెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ విద్యార్థినికి జాతీయ నంది పురస్కారం



రామ లాలిత్యను అభినందిస్తున్న జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఎంటెక్ (కంప్యూటర్ సైన్సెస్) మొదటి సంవత్సరం విద్యార్థిని డి. రామ లాలిత్య జాతీయ స్థాయి బాల గణపతి నాట్య నందీశ్వర పురస్కారం అందుకుంది. చిత్తూరు కాణిపాకం వరసిద్ధి వినాయక ఆలయంలో శ్రీ సాయి నాట్యాంజలి ఫైన్ ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేన్, మినిస్ట్రీ ఆఫ్ కల్చర్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా , డిపార్ట్‌మెంట్ ఆఫ్ లాంగ్వేజ్ అండ్ కల్చర్, గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్తంగా 8వ జాతీయ నంది పురస్కారాలు అందించారు. డి. రామలాలిత్య తల్లిదండ్రులు బాబుబాలాజీ, కమల బాలాజీ ప్రోత్సాహంతో ఎన్నో అవార్డులు, రికార్డులు సాధించారు. నాట్య మయూరి, నృత్యశ్రీ, నాట్యకళామని, నృత్య మీనాక్షి, నాట్య హంస అవార్డులు గతంలో దక్కాయి. ఈ సందర్భంగా రామలాలిత్యను జేఎన్‌టీయూఏ వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన , రెక్టార్ ప్రొఫెసర్ విజయ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ. అరుణకాంతి, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ కేఎఫ్ భారతి అభినందించారు.

ఘనంగా సత్యనారాయణ వ్రతం



సామూహిక సత్యనారాయణ వ్రతం చేస్తున్న దృశ్యం

యాడికి: మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. 21 జంటలకు అర్చకులు వ్రతాన్ని చేయించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు, వాసవీ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమి వేడుకలు

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో సోమవారం కార్తీక పౌర్ణమి సందడి నెలకొంది. శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. హరహర మహాదేవ శంభో శంకరా అంటూ భక్తులు పూజలు చేశారు. అలాగే మహిళలు ఆలయాలు వద్ద భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.